
రోడ్ల నాణ్యత పరిశీలన



తెనాలి అర్బన్: పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు రోడ్లను క్వాలిటీ కంట్రోల్ బృందం సోమవారం పరిశీలించింది. వాటి నాణ్యత ప్రమాణాలను చెక్ చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామ శివారు రేగులగడ్డలో వందేళ్లనాటి సీతారామ చంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
గుంటూరు	6.22	5.02
నరసరావుపేట	6.24	5.04
బాపట్ల	6.22	5.02

ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరినా మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లు ఉసూరుమనిపిస్తున్నాయి. జిల్లాలోని ఎనిమిది యార్డులకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.133.69 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.102.82 కోట్లు మాత్రమే వసూలైంది.

వసూలు.. ఉసూరు..!

- జిల్లాలోని మార్కెట్ యార్డుల లక్ష్యం రూ.133.69 కోట్లు
- ఇప్పటి వరకు రూ.102.82 కోట్లు మాత్రమే వసూలు
- సీజన్ ముగుస్తున్నా లక్ష్య సాధనలో వెనుకబాటు



గుంటూరు మార్కెట్ యార్డ్

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, దుగ్గిరాల, తాడికొండ, మంగళగిరి, ఫిరంగిపురం, ప్రత్తిపాడు మార్కెట్ యార్డులు ఉండగా... వీటి పరిధిలో 18 చెక్‌పోస్టులు ఉన్నాయి. గత ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రబీ పంటల సీజన్ వరకు మార్కెట్లలో పంటల క్రయవిక్రయాలపై వ్యాపారులు, కొనుగోలుదారుల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది. జిల్లాలోని దుగ్గిరాల మార్కెట్ యార్డు 99.21 శాతంతో ముందంజలో ఉంది. ఫిరంగిపురం 61.16 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇక ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మార్కెట్ యార్డు లక్ష్యం రూ.106 కోట్లు కాగా, రూ.79.21 కోట్లు వసూలు చేశారు. లక్ష్యాన్ని చేరేందుకు మార్చి నెల చివరి వరకు గడువు ఉంది. ఈ సమయంలో రూ.30.87 కోట్లు మేర వసూలు చేయడం సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఈ రెండు సంస్థలు ఇచ్చిందే రూ.9 కోట్లు

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా పలు ప్రభుత్వరంగ సంస్థలు పంట కొనుగోలు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం, కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టింది. ఈ రెండు సంస్థలు కొనుగోలు చేసిన పంటల విలువలో ఒక శాతం పన్ను మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. సీసీఐ నుంచి రూ.4 కోట్లు, పౌర సరఫరాల శాఖ నుంచి రూ.5 కోట్లు మార్కెట్ యార్డులకు ఇప్పటికే జమయ్యాయి. ఈ రూ.9 కోట్లు వసూలు కావడంతో ఈ మాత్రం పురోగతి కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

మార్కెట్ యార్డ్	లక్ష్యం	వసూలు	శాతం
	(రూ.కోట్లలో)		
గుంటూరు	106	79.21	74.72
మంగళగిరి	3.10	2.10	67.83
ఫిరంగిపురం	1.95	1.19	61.16
తాడికొండ	2.10	1.47	69.88
పొన్నూరు	6.95	6.10	87.80
ప్రత్తిపాడు	3.72	3.32	89.12
తెనాలి	6.60	6.18	93.70
దుగ్గిరాల	3.27	3.24	99.21
మొత్తం	133.69	102.82	76.91

మార్కెటింగ్ శాఖ ప్రత్యేక దృష్టి..

ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. మార్కెట్ కమిటీల కార్యదర్శులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, డీడీఎంలు, ఏడీఎంలతో మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత తరచుగా సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అదే సమయంలో పంటల విక్రయాలు జరుగుతున్నా లక్ష్యాన్ని చేరకపోవడంపై పలు మార్కెట్ యార్డుల అధికారుల నుంచి వివరణ అడిగినట్లు సమాచారం. నిర్దేశిత గడువులోగా మార్కెట్ యార్డులు, చెక్ పోస్టులతోపాటు గోదాముల నుంచి రావాల్సిన పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.

నేడు సమావేశం

చుట్టుగుంటలోని మార్కెటింగ్‌శాఖ సమావేశ మందిరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. బాగా వెనుకబడ్డ యార్డుల కార్యదర్శులను కారణం కోరుతూ వివరణ అడగనున్నట్లు సమాచారం.

గడువులోగా లక్ష్యాన్ని సాధిస్తాం



మార్కెట్ ఫీజు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాం. బకాయి ఉన్న ఏజెన్సీలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ట్రేడర్లు కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులకు సంబంధించి బకాయిల వసూలుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతున్నాం. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేస్తాం.

– బి.రాజబాబు, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు

న్యూస్‌రీల్

ఎలక్ట్రిక్ బస్సులు వితరణ



మంగళగిరి: మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండతోపాటు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు రెండు ఎలక్ట్రిక్ బస్సులను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సోమవారం అందజేసింది. బస్సులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఈ బస్సుల్లో ఒకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ ఆఫీసు మీదుగా ఎయిమ్స్‌కు వెళ్తుంది. మరొకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్ మీదుగా శ్రీ పానకాలస్వామి కొండకు వెళ్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో సోమవారం తొలి మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది. పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం–2బీ పరీక్షకు గుంటూరు జిల్లాలోని 87 పరీక్షా కేంద్రాల పరిధిలో 28,274 మంది విద్యార్థులు హాజరయ్యారు. 446 మంది గైర్హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు ప్రయత్నించిన ఓ విద్యార్థిపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. ఆర్ఐవో జీకే జుబేర్ ఐదు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంగళగిరి: సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం మంగళగిరి మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, అధికారులతో కలిసి ఆమె వర్సిటీని సందర్శించారు. సీఎం ప్రారంభించనున్న సీవీ రామన్ బ్లాక్, ప్రసంగించనున్న అబ్దుల్ కలామ్ ఆడిటోరియం తదితర ప్రదేశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు, ప్లానింగ్ ఈడీ వీఆర్ అలపర్తి, సెక్రటరీ అనంత్ సింగ్, రిజిస్ట్రార్ ఆర్. ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్ సింగ్, జీఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష రద్దు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 7న జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పర్సెక్టివ్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్షను వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు రద్దు చేశామని సీఈ ఏ శివప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 12వ తేదీన తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు.

యార్డుకు 1,61,169 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,61,169 బస్తాల మిర్చి రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,30,718 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది.

సింహ వాహనంపై
బ్రహ్మాండ నాయకుడు

గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన నారసింహుడు



చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి



సింహ వాహనంపై స్వామి వారు



దర్శించుకుంటున్న భక్తులు

మంగళగిరి / మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు సింహవాహనంపై దర్శనమిచ్చారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. హింసించే స్వభావం గల వారిని హింసించేవాడు నారసింహుడు, నరుల్లో సింహం వంటి వాడు నరసింహ స్వరూపుడైన స్వామి వారి సింహ వాహనోత్సవం తిలకించిన వారికి దుర్మార్గుల వల్ల కలిగే భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. ఉత్సవం సందర్భంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు మనుమలు వ్యవహరించారు. సోమవారం ఉదయం చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కైంకర్యపరులుగా దేవతి భగవన్నారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

నేడు హంస, గజ వాహన సేవలు

మంగళవారం ఉదయం హంస వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి గజ వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

కూటమి పాలనపై
ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

- ఒక్క సంక్షేమ కార్యక్రమాన్నీ పరిపూర్ణంగా అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం
- సమయం వచ్చినప్పుడు ఓట్లతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ప్రజలు
- యువత పోరు సన్నాహక సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి
- రేపటి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం, యువత పోరు జయప్రదానికి విజ్ఞప్తి

నెహ్రూనగర్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన జరగనున్న యువత పోరుకు సంబంధించి సోమవారం సన్నాహక సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి పాలనలో రాష్ట్రం తిరోగమనంలో ఉందన్నారు. గుంతలు పూడ్చి రోడ్లు వేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. 9 నెలల కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పరిపూర్ణంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఇస్తున్న వృద్ధాప్య పింఛన్లలో భారీగా కోతలు పెడుతున్నారని విమర్శించారు. 9 నెలల కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిందని, సమయం వచ్చినప్పుడు ఓట్లతో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.

కూటమి ఎమ్మెల్యేల అక్రమాలు అనంతం

కూటమి పాలనలో ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, బియ్యం అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ పని చేయాలన్నా కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. రోజు రోజుకు కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిపోతోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 12న జరిగే వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో, యువత పోరు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాలుపంచుకుని దిగ్విజయం చేయాలన్నారు. తద్వారా ఈ ప్రభుత్వం సక్రమంగా పనిచేయడం లేదనే సందేశాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. పార్టీ శ్రేణులే పేదవారి గొంతుగా మాట్లాడాలని సూచించారు. పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ స్థానాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆనాడు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక ఎత్తు అయితే.. తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. మోసం చేయడంలో నంబర్ వన్ అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబు పేరే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. సమాజంలో విద్య, ఆరోగ్యం రెండు కళ్లు వంటివన్నారు. నేడు విద్యకు సంబంధించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో విద్యార్థులు కాలేజీల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఏపీలో 28 మెడికల్ కాలేజీలు ప్రారంభమైతే.. ఇంటికే వచ్చి వైద్యం చేసే పరిస్థితి ఉందన్నారు. ఆ మెడికల్ కాలేజీలను నేడు ప్రైవేటీకరణ చేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. వీటన్నింటిపై పోరాటం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు నగర అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణలు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఇవేం స్పీడ్ బ్రేకర్లు?

గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన చర్యలు వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తున్నాయి. బైక్ రేసర్ల ఆట కట్టించేందుకు ప్రధాన రహదారులైన లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్, విద్యానగర్, పట్టాభిపురం, స్తంభాలగరువు వంటి ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను అడ్డగోలుగా నిర్మించారు. కనీస ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

- నగరంలోని స్పీడ్ బ్రేకర్లతో వాహన చోదకులకు నిత్యం నరకం
- నిర్దేశిత ప్రమాణాల ప్రకారం కాకుండా అడ్డగోలుగా నిర్మాణం
- బ్యాలెన్స్ తప్పుతుండటంతో ప్రమాదాల బారిన బైకు చోదకులు



పట్టాభిపురం, స్తంభాలగరువు వైపు రహదారిపై వైట్ కలర్ రేడియం పెయింట్ వేయని దృశ్యం



రింగ్ రోడ్డు, విద్యానగర్ ప్రాంతంలో రెండేసి స్పీడ్ బ్రేకర్లను మలుపు వద్ద నిర్మించిన వైనం

లక్ష్మీపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గుజ్జనగుండ్ల నుంచి విద్యానగర్, రింగ్‌రోడ్డు, కొరిటెపాడు వరకు ఒక్కో ప్రదేశంలో మూడు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ఈ విషయం గ్రహించిన అధికారులు మూడు స్పీడ్ బ్రేకర్లకు బదులు కొన్నిచోట్ల నామమాత్రంగా రెండు స్పీడ్ బ్రేకర్లుగా సరి చేశారు. ఇంకా చాలాచోట్ల అలాగే ఉన్నాయి. ముఖ్యంగా అమరావతి రోడ్డులోని నగరాలు వెళ్లే మార్గంలో ఇరువైపులా మూడు స్పీడ్‌బ్రేకర్లు అడ్డగోలుగా వేయడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

యూటర్న్‌లలో ప్రమాదకరంగా..

ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన ప్రదేశాలలో ప్రతిచోట దాదాపు మలుపు తిరిగే ప్రాంతం కావడంతో యూటర్న్ తీసుకునే సమయంలో వాహనదారుల సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. భారీ వాహనాలు అటుగా ప్రయాణించే సమయంలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లను సరిచేసి వాహనదారులు స్పీడ్ తగ్గించి ఎలాంటి ప్రమాదాలబారిన పడకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా నగరవాసులు కోరుతున్నారు. ఇటీవల కొన్ని రోజుల క్రితం పట్టాభిపురం, స్తంభాలగరువు మీదుగా పలు ప్రదేశాలలో స్పీడ్ బ్రేకర్లను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు. పైగా వాటిపై కనీసం నిర్దేశిత రంగులు కానీ, రేడియం లైట్లు, కలర్‌లుగానీ వేయకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బైకు రేసర్ల కట్టడికి సిబ్బందితో నిఘా పెట్టడం, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం వంటివి చేయాలేగానీ ఇలా అడ్డగోలుగా స్పీడ్ బ్రేకర్లు వేయడమేంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతే ఎవరు సమాధానం చెబుతారని జనం మండిపడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

యువత బైక్ రేసుల్లో పాల్గొనకుండా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సిందిగా నగరపాలక సంస్థ అధికారులకు సూచించాం. వారి నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. రేడియం పెయింట్ వేయించాల్సిందిగా వెస్ట్ ట్రాఫిక్ సీఐ ద్వారా లేఖ కూడా పంపాం. రింగ్ రోడ్డు వైపు ఉన్న రెండు స్పీడ్ బ్రేకర్లు యూటర్న్ వద్ద ఉన్నందున పరిశీలించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. స్పీడ్ బ్రేకర్లు పెట్టినా బైక్ రేసర్ల స్పీడ్ తగ్గడం లేదు. బ్రేకర్లతో పాటు జిగ్‌జాగ్ స్టాప్ బోర్డులను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ

తీవ్ర ఇబ్బందులు

ప్రమాణాలు పాటించని స్పీడ్ బ్రేకర్ల దెబ్బకు నగరవాసుల నడుం విరిగినంత పనవుతోంది. చాలాసార్లు బైకు బ్యాలెన్స్ కుదరక అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బైకుపై వెనుక భాగంలో కూర్చున్నవారు జారి కింద పడుతున్నారు. ఇక వృద్ధులు బైకు నడపాలంటేనే గజగజ వణికిపోతున్నారు. పేషెంట్లు అటుగా వెళ్లాలన్నా, వారిని బైకుపై తీసుకెళ్లాలన్నా బైకు నడిపేవారికి నరకమే. గర్భిణుల పరిస్థితి చెప్పే పనే లేదు. విద్యాసంస్థలకు పిల్లలను తీసుకుని బ్యాగులతో వచ్చీపోయే తల్లులు స్కూటీలను ఈ స్పీడ్ బ్రేకర్ల దగ్గర అదుపు చేయలేక బెంబేలెత్తుతున్నారు. పురుషులు కూడా చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. పలువురి జేబుల్లోని సెల్‌ఫోన్‌లు కింద పడటం, వాటిని తీసుకోవడానికి వాహనాలు పక్కకు ఆపి మళ్లీ వెనక్కి రావాల్సిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇక కాస్త ఖరీదైన కార్లు కింది భాగం స్పీడ్ బ్రేకర్లకు తగులుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు పెరుగుతున్నాయి. పైగా వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని యజమానులు వాపోతున్నారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం స్పీడ్‌బ్రేకర్లు నిర్మించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించండి


జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు కూడా ప్రజలు ప్రతి వారం అర్జీలను ఇవ్వొచ్చన్నారు. ఇచ్చిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని తెలిపారు. అనంతరం వచ్చిన 290 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి పరిశీలించారు.

పెన్షన్ ఇచ్చి ఆదుకోండి



నేను ఏడాది క్రితం రైలు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయాను. కాలు పూర్తిగా పోయింది. శరీరమంతా గాయాలయ్యాయి. ప్రస్తుతం ఏ పనీ చేసుకోలేను. ఇద్దరు ఆడపిల్లలున్నారు. వికలాంగుల పెన్షన్ ఇచ్చి పుణ్యం కట్టుకోండి.

– చల్లా శివ శంకర్, గుంటూరు

జీబీ సిండ్రోమ్‌తో మహిళ మృతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జీబీ సిండ్రోమ్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న పల్నాడు జిల్లా ముప్పాళ్ల మాదలకు చెందిన సీతామహాలక్ష్మి(50) మృతి చెందింది. 4 రోజుల క్రితం చికిత్స కోసం ఆమె చేరింది.

ఉద్యోగాల పేరిట మోసాలు



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: ఉద్యోగాల పేరిట మోసగించారని పలువురు బాధితులు వాపోయారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు, పరిష్కారాల వ్యవస్థ ద్వారా అర్జీలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి బాధితుల నుంచి అర్జీలు తీసుకున్నారు. సకాలంలో బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఏఎస్పీలు (క్రైం) కె.సుప్రజ, హనుమంతు, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ కూడా అర్జీలు స్వీకరించారు.

చిట్టీల పేరుతో..

సంగడిగుంట కిడాంబినగర్ ఐదో వీధిలో ఉంటున్న తల్లి, కుమారుడు వస్త్ర దుకాణం నిర్వహించేవారు. రెండేళ్ల నుంచి చిట్టీ పాటలు నడుపుతున్నారు. గతేడాది తల్లి హఠాన్మరణం చెందారు. కుమారుడు చిట్టీ పాటల నగదు చెల్లిస్తానని నమ్మబలికాడు. ప్రస్తుతం ఆర్టీసీకాలనీలో ఉంటున్న అద్దె గృహాన్ని ఖాళీ చేశాడు. ఎవరైనా మొబైల్‌కు కాల్ చేసి డబ్బులు అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. దాదాపు రూ.25 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. న్యాయం చేయగలరు.

– బాణాల లక్ష్మి, శివపార్వతి, బాధితులు, సంగడిగుంట

ఉద్యోగం ఇప్పిస్తానని..

ఉద్యోగం పేరుతో లక్షల్లో కాజేశారు. కలెక్టర్ కార్యాలయంలో చిరుద్యోగం ఇప్పిస్తానని అమరావతి రోడ్డులోని ఓ సర్వీస్ నిర్వాహకులు నమ్మబలికారు. ఈ క్రమంలో 2022, 2023లో రెండు సార్లుగా రూ.5 లక్షలు చెల్లించాను. ఈ క్రమంలో ఉద్యోగ నియమాక పత్రాన్ని అందించారు. ఆ పత్రం నకిలీదని గుర్తించాం. ఉద్యోగం కోసం చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే సరైన సమాధానం లేదు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– పి.కోటేశ్వరమ్మ, యడ్లపాడు మండలం

డ్రైవర్ ఉద్యోగమని చెప్పి..

డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తామని మహిళా హోంగార్డు, ఆమె కుమారుడు నమ్మబలికారు. దఫాలుగా రూ.2.70 లక్షలు చెల్లించాను. ఉద్యోగం ఇప్పించకపోగా పలుమార్లు అడిగినా సరైన సమాధానం లేదు. దీనిపై చిలకలూరిపేట పోలీసులకు ఫిర్యాదు చేశా. పోలీసుల సమక్షంలో నగదు చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉందని, మాట దాట వేశారు. ప్రస్తుతం కుటుంబ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. న్యాయం చేయగలరు.

– సీహెచ్.ఎ.శంకర్, మురికిపూడి గ్రామం, చిలకలూరిపేట

ప్రకృతి సాగుకు ఫ్రాన్స్ బృందం ప్రశంసలు



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు తదితరులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేసిన పెరటి తోటలను పరిశీలించడానికి ఫ్రాన్స్ బృందం సోమవారం కొల్లిపర మండలంలోని అత్తోట, దావులూరు పాలెం గ్రామాలను సందర్శించింది. రైతు సాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) ఆధ్వర్యంలో ఈ తోటలు సాగు అవుతున్నాయి. ముందుగా గుంటూరులోని కృషి భవనంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) కే రాజకుమారితో ఫ్రాన్స్ బృందం సభ్యులు సమావేశమయ్యారు. డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అనంతరం బృంద సభ్యులు అత్తోట, దావులూరిపాలెం గ్రామాలలో 365 రోజుల కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, ఏ గ్రేడ్ ఏటీఎం, సూర్య మండలంలోని పలు మోడల్స్‌ను పరిశీలించారు. బీజామృతం, ఘన జీవామృతం తయారీ తెలుసుకున్నారు. అభ్యుదయ గ్రామ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం బాగా చేస్తున్నారని బృందం ప్రశంసించింది. కార్యక్రమంలో నాగలక్ష్మి, ఎంటీఎల్ మాధవి, ఎంటీ పాండురంగారావు, ఎస్ఎఫ్ఎఫ్ రజిని, అవినాష్, ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు సోమవారం 288 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం విక్రయించినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 288 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.8000, గరిష్ఠ ధర రూ.11,111, మోడల్ ధర రూ.10,601గా ఉందని పేర్కొన్నారు. మొత్తం 216 క్వింటాళ్లు విక్రయించినట్లు ఆయన తెలిపారు.